క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జాతర


వెదురుపట్టులో ప్రత్యేక అలకరణలో గంగమ్మ

దొరవారిసత్రం : మండలంలోని వెదురుపట్టు గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతర గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలకరించి పూజలు చేశారు. గ్రామంలోని ప్రతి కుటుంబమూ ఎంతో భక్తి శ్రద్ధలతో గంగమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు వేనాడి రామచంద్రారెడ్డి, సర్పంచ్ మధురెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, బాబునాయుడు తదితరతులు పాల్గొన్నారు.

మూలన పడిన ఆర్వో ప్లాంట్



దొరవారిసత్రం : నెలబల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుద్ధిచేసిన నీరు అందించాలనే తలంపుతో గత ప్రభుత్వం మన బడి నాడు–నేడు కింద లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. నిర్వహణ లోపంతో ఏడాదికి పైగా అది నిరుపయోగంగా మారి మూలన పడింది. దీన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. దీంతో పాఠశాలలో ఉన్న 50 మంది విద్యార్థులు ఇళ్ల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడంలేదని పిల్లల తల్లిదండ్రులు తెలియజేశారు.

ఎన్టీఆర్ కాలనీలో పోలీసుల తనిఖీలు


సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ వెంకటరమణ

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణం ఎన్టీఆర్ కాలనీలో శనివారం సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు చెందిన పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇళ్లు, వాహనాలను పరిశీలించారు. పత్రాలు లేని ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ తమ సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బందితో ఎన్టీఆర్ కాలనీలో తనిఖీలు చేపట్టామన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేలా, స్మగ్లింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్‌ఐలు జిత్యానాయక్, గోపి పాల్గొన్నారు.

సురక్షితమైన నీటి సరఫరాకు చర్యలు


ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం కౌన్సిలర్లతో కలిసి చింతగుంట సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, నీటి శుద్ధిచేసే యంత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిపారు. ఎవరికీ ఇబ్బంది కలుగకుండా మంచి నీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, టీడీపీ నేతలు పులుకొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్ పాల్గొన్నారు.

పవన్‌కు సైకత శుభాకాంక్షలు



సనత్‌కుమార్ రూపొందించిన సైకత శిల్పం

చిల్లకూరు : సినీ నటుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఏరూరు సమీపంలోని సముద్రం వద్ద ఆదివారం సైకత శిల్పకారుడు సనత్‌కుమార్ పవన్ కళ్యాణ్ సైకత శిల్పాన్ని రూపొందించాడు. అతన్ని జనసేన నాయకులు అభినందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం 156వ నెల ఉచిత సరుకులను దివ్యాంగులు, వృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ ఇన్ని నెలలుగా పేదవారికి, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో తాను భాగస్వామి కావడం సంతోషంగా ఉందని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా, సభ్యులు రాజేశ్వరరావు, హరి, ఢిల్లీ, బాబా ఫరీద్ పాల్గొన్నారు.

బస్సు యాత్రలో భాగంగా నాయుడుపేటలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వైఎస్సార్(ఫైల్)



నాయుడుపేటలో రోడ్డు పక్కన స్నానం చేసి టెంట్‌లోకి వెళుతున్న వైఎస్సార్ (ఫైల్)



మేనకూరులో ఏర్పాటుచేసిన గ్రీన్‌టెక్ ప్రైమ్ మెడిన్, భారీ పరిశ్రమలు





మేనకూరు సెజ్‌కు స్వాగతం పలికే ఆర్చి నిర్మాణం



వైఎస్సార్ కలే నేటి మేనకూరు సెజ్

నాయకుడి ఆలోచనలు, నిర్ణయాలపైనే ఆ ప్రాంతం అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయి. మంచి చేయాలన్న తపన పాలకుడిలో ఉంటే ఎన్నో జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతాయి. అలాంటి పాలకుడే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్. ఆయన ఆలోచన నుంచి ఉద్భవించిందే మేనకూరు సెజ్. నేడు వేలాది మందికి ఉపాధి ఇచ్చే కల్పతరువుగా మారింది. ప్రస్తుతం వైఎస్సార్ భౌతికంగా దూరమైనా ప్రజల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. – నాయుడుపేట టౌన్

- అనేక పరిశ్రమల ఏర్పాటు
- వేలాది మందికి ఉపాధి

తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ పారిశ్రామిక విప్లవంతో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. 2008 మే నెలలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మేనకూరు సెజ్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ ప్రాంతం నెల్లూరు కృష్ణపట్నం పోర్టు, తిరుపతి, రేణిగుంట, చెన్నై, బెంగళూరు విమానాశ్రయాలకు దగ్గరగా ఉండటం, జలవనరులు పుష్కలంగా ఉండటంతో పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతోంది. వందల సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు కావడంతో వేలాది మంది యువతకు ఉద్యోగాలు లభించాయి. అలాగే పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి లభిస్తోంది. భూముల రేట్లు పెరగడంతో రైతుల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. ఈ ప్రాంతం ఆర్థికంగా ముందుకు సాగుతోంది.


మేనకూరు సెజ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)


నాయుడుపేట ఏఎల్‌సీఎం గ్రౌండులో వైఎస్సార్ బహిరంగ సభకు హాజరైన ప్రజలు(ఫైల్)


మేనకూరులో ఉన్న పలు పరిశ్రమల బోర్డులు

ప్రజల గుండెల్లో నిలిచిపోయిన వైఎస్సార్

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాక ముందు కూడా పలు పర్యాయాలు నాయుడుపేటలో పర్యటించారు. ప్రజల సమస్యలపై రోడ్‌షోలు, బస్సు యాత్ర చేపట్టారు. ఆయనకు ప్రజలు విశేష ఆదరణ చూపారు. అప్పట్లో స్థానిక ఏఎల్‌సీఎం గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభకు నాయుడుపేట చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా ప్రజలు పోటెత్తారు. ఆయన పర్యటనలో చిన్నపాటి వాహనంలో బస చేయడంతోపాటు రోడ్డు పక్కనే స్నానం చేయడాన్ని చూసిన జనం చలించిపోయారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషిని నేటికీ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

భారీ పరిశ్రమల ఏర్పాటు

మేనకూరులో ఇప్పటి వరకు చిన్న మధ్య తరహా భారీ పరిశ్రమలతో కలిసి 25కు పైగా ఉన్నాయి. తొలుత వైఎస్సార్ భూమి పూజ చేసిన నాటి నుంచి అనూహ్య రీతిలో కంపెనీల స్థాపన జరిగింది. మేనకూరు సెజ్‌లో హిందుస్థాన్ నేషనల్ గ్లాస్, గ్రీన్‌టెక్, లాయల్ టెక్స్‌టైల్స్, ప్రైమ్ మెడిన్, హీమెయిర్, అరబిందో ఫార్మా వంటి భారీ పరిశ్రమలు, జేబీఏ గ్లాస్, నేషనల్ ప్లాస్టిక్, కెమిస్ట్రీ ల్యాబ్, బీఏఎస్ఎఫ్, నిత్య స్టీల్స్, డీఆర్‌పీ స్టీల్స్, టీవీఎస్, గుజరాత్ ఎన్ఆర్ఈ కోక్ లిమిటెడ్ పరిశ్రమలే కాకుండా పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. రూ.750 కోట్లతో నెలకొల్పిన చైనా దేశానికి చెందిన గ్రీన్‌టెక్ పరిశ్రమ మళ్లీ రూ.627 కోట్లతో విస్తరణ చేపట్టేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఒక్క గ్రీన్‌టెక్ పరిశ్రమలోనే 2700 మందికి ఉద్యోగాలు లభించాయి. కొత్తగా చేపట్టే విస్తరణ ద్వారా మరో 2200 మందికి ఉద్యోగ అవకాశం కలగనుంది. పరిశ్రమల పుణ్యమా అని మేనకూరుతో పాటు నాయుడుపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థలాల ధరతో పాటు ఇంటి అద్దెలు సైతం బాగా పెరిగాయి. అదే విధంగా తండ్రి బాటలో నడుస్తూ ఆయన ఆశయాలకు జీవం పోసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా మేనకూరు పరిశ్రమల కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కూడా నియోజవర్గంలోని సెజ్‌ల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

ప్రజల గుండెల్లో కొలువైన నేత వైఎస్సార్



నాయకుడు అనే మాటకే రోల్ మోడల్‌గా నిలిచిన వ్యక్తి వైఎస్ రాజశేఖరరెడ్డి. మాట తప్పేది లేదు.. మడమ తిప్పేది లేదు అంటూ పలు సంక్షేమ పథకాలు అమలుచేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నాయకుడంటే ఇలానే ఉండాలి.. ఇలానే పనిచేయాలి అని నిరూపించుకున్నారు. ఆయన చివరి శ్వాస వరకు ప్రజల సంక్షేమం కోసమే పని చేశారు. ముఖ్యంగా నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన కృషి అంతాఇంతా కాదు. అందుకే ఆయన ప్రజల హృదయాల్లో దేవుడిగా నిలిచిపోయారు.
– కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే

పాత పెన్షన్ విధానం అమలుచేయాలని నిరసన


నాయుడుపేట : ప్లకార్డులను ప్రదర్శిస్తున్న బీటీపీ నాయకులు

నాయుడుపేట టౌన్ : ఎన్నికల ముందు చెప్పిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని బీటీఏ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం నాయుడుపేట పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి తర్వాత పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే బీటీఏ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు టి.విశ్వనాథ్, పేర్నాటి రామకృష్ణ, జె.వెంకటరావు, బి.బాబు, బి.సుధాకర్, టి.నాగరాజు, బి.కుమార్ పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు.


నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

వారు ఆదివారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ 1938 శాఖ నేత ఎస్‌కే బాబు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ విరమణ చేసిన తర్వాత జీవితాలకు భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జయపాల్‌రెడ్డి, భాస్కరరెడ్డి, శివకుమార్, చంద్రశేఖర్, శివప్రసాద్, కోటేశ్వరరావు, మురళి, లోకనాథం, చంద్రశేఖర్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పొంగళ్లు


అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసియున ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం వెలుపల ఉన్న త్రిశూలం వద్ద మహిళలు ఒరపడి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. చిన్నారులు వేయి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని ఒంటికి వేప మండలు చుట్టుకుని మొక్కలు చెల్లించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఆలయ ఈవో నవీన్‌కుమార్, కమిటీ సభ్యుడు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

నాయుడుపేట టౌన్ : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను గ్రామాల్లో చురుగ్గా చేపట్టాలని ఆ పార్టీ మండల బాధ్యుడు ఏవీఎస్ రవీంద్ర కోరారు. ఆయన ఆదివారం నాయుడుపేట పట్టణంలోని బీజేపీ రూరల్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పట్టుకోట రవి అధ్యక్షతన నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ ఇన్‌చార్జి ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ సభ్యత్వాలను అధిక సంఖ్యలో నమోదు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు గురుప్రసాద్ రాజు, సీహెచ్ వేణయ్య, రమణయ్య, జీ సుబ్బారావు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నవావరణ హోమం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సీఆర్ రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం నవావరణ హోమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కోట సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వెదురుపాక విజయదుర్గ పీఠాధిపతి గాడ్ ఆశీస్సులతో 700వ మహా నవావరణ హోమం చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం 699వ హోమం నిర్వహిస్తున్నామన్నారు. లోక కల్యాణం కోసం చేపట్టే ఇలాంటి హోమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నాయుడుపేట టౌన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన నాయకులు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం నాయుడుపేట పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది యువకులు రక్తదానం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నెలవల రాజేష్, గిండి సతీష్ ఓ జానకి రామ్, బొల్లకాయల కిరణ్, బాలుశెట్టి పాల్గొన్నారు.

కండలేరులో 7.187 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 7.187 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3700 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. అలాగే సత్యసాయిగంగ కాలువకు 260, పిన్నేరువాగుకు 25, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి ప్రత్యేక కార్యక్రమాలు

వెంకటగిరి(సైదాపురం)/రాపూరు/నాయుడు పేట టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని కోరారు. అలాగే సైదాపురంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్ తెలిపారు. రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి తెలిపారు. నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండు, పిచ్చిరెడ్డితోపు వీధిలో ఉన్న వైఎస్సార్ విగ్రహాల వద్ద మాజీ ఎమ్మెల్యే, నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి నివాళులర్పించి పేదలకు అన్నదానం చేస్తామని తెలిపారు.

3 నుంచి గంగా భవాని ఆలయ కుంభాభిషేకం


గంగాభవాని ఆలయ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు గ్రామ దేవత తాళ్లమ్మ ఆలయ అనుబంధ గంగా భవాని ఆలయ కుంభాభిషేకాన్ని 3వ తేదీ నుంచి 5 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న గంగా భవాని ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. ఈ క్రమంలో కుంభాభిషేకం చేయాలని నిర్ణయించారు. ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. కమిటీ సభ్యులు తిరకాల నాగేశ్వరరావు, శ్రీనివాసులు, చెంచయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో పాఠశాల తరగతి గదులు

మండల కేంద్రమైన సైదాపురం పడమర వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు చెందిన రేకుల షెడ్డు, మరో భవనం శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాల పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. విద్యార్థులు నిత్యం పాత గదుల వైపు వెళుతుంటారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రేకుల షెడ్డును తొలగించాలని కోరుతున్నారు. – సైదాపురం



మామిడిలో కొమ్మల కత్తెరింపుతో అధిక దిగుబడి


మామిడి చెట్లు

సైదాపురం: మామిడి చెట్ల కొమ్మలను జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కత్తెరించడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చుని పొదలకూరు ఉద్యానవన శాఖాధికారి ఆనంద్ తెలిపారు. చెట్లు గుబురుగా ఉండి గాలి, వెలుతురు తగలకపోతే పంట సరిగా రాదన్నారు. ప్రతి ఏటా జూలై–సెప్టెంబర్ మధ్య గుబురుగా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించి చెట్టు ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు, 10 ఏళ్ల నిండిన చెట్టుకు 100 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల యూరియా, 5 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ 1.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను చెట్టుకు 4–5 అడుగుల దూరంలో చుట్టు వేయాలన్నారు. అనంతరం నీరు పారిస్తే మంచిదన్నారు. తోటల్లో జనుము, పిల్లి పెసర వంటి అంతర పంటలను వేసి పూత దశలో కలియ దున్నాలని పేర్కొన్నారు. అప్పుడు భూమి సారవంతమై చెట్టు మరింత పెరుగుతుందన్నారు.

చిన్నారుల్లో వచ్చే రుగ్మతలను గుర్తించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మీ

గూడూరు రూరల్ : చిన్నారుల్లో వచ్చే రుగ్మతలను గుర్తించి వెంటనే వైద్యం అందిస్తే త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందని వసంత లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు అండ్ రీసెర్చ్ సెంటర్ వైద్యులు విజయలక్ష్మీ తెలిపారు. గూడూరు పట్టణంలోని గాంధీ నగర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్న పిల్లలకు వైద్య సేవలు అందించారు. ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలు తమకు ఎలాంటి జబ్బు చేసిందనే విషయాలు చెప్పలేని స్థితిలో ఉంటారని, వారి ప్రవర్తనను గుర్తించి వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మాల్యాద్రి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎంకు సన్మానం


విశ్రాంత ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నేతలు

కోట : మండలంలోని గోవిందపల్లిపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న పూర్ణానందబాబు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను ఆదివారం కోటలోని అల్లారెడ్డి శ్యామ్‌సుందరరెడ్డి భవన్‌లో పలువురు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, నాయకులు ఘనంగా సన్మానించారు. విద్యారంగానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి అధికారుల మన్ననలు పొందారని ప్రశంసించారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ఎంఈవో మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జేవీవీ లక్ష్యం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

శ్రీకాళహస్తి: ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలను పారదోలి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు. పట్టణంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రత్యేకంగా చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం టాలెంట్ టెస్టు పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో షరీఫ్, అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, శ్రీనివాసులు, చెంగయ్య, కుప్పయ్య పాల్గొన్నారు.